క్లుప్తంగా

'రైతునేస్తం' విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలో రైతువేదికలో మంగళవారం జరగనున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇచ్చోడ క్లస్టర్ ఏఈవో అనుదీప్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక ప్రసారం ద్వారా జరిగే కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు విత్తనాల ఎంపిక, పలు పంటల సాగుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అందుబాటులో సోయా విత్తనాలు

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో సోయా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో కేశవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎస్ 9305, ఎంఏయూఎస్ 612 రెండు రకాలకు చెందిన సోయా విత్తనాలు ఉన్నాయన్నారు. 30 కేజీల విత్తనాల బ్యాగు ధర రూ.2525 ఉందన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రైతుల ఖాతాల్లో జొన్నల నగదు జమ

కైలాస్‌నగర్: రైతుల ఖాతాల్లో జొన్న నగదు జమ అవుతున్నట్లు ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా జొన్నలకు సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడం లేదని సంబంధిత జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి ప్రవీణ్ రెడ్డిని ఫోన్ ద్వారా విషయం అడగగా.. సోమవారం సాయంత్రం నుంచి జొన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 16వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు ప్రభుత్వం జమ చేయనుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.

చిత్రం గీసి.. అభిమానం చాటి



మోదీ చిత్రపటాన్ని గీసిన సుజయ్‌కుమార్

బోథ్: మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల కేంద్రానికి చెందిన నమలికొండ సుజయ్‌కుమార్ వర్మ మోదీ చిత్రపటాన్ని గీసి అభిమానం చాటాడు. తిరుపతి కంచికామకోటి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో వేద విద్యను అభ్యసిస్తున్న సుజయ్ మాట్లాడుతూ.. అయోధ్యలో బాల రాముడికి ప్రతిష్ఠించడంతో పాటు భారతదేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల వ్యాప్తంగా చాటిచెప్పిన మోదీ అంటే తనకు అభిమానమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: మండలంలోని బోథ్, కౌఠ(బి) బీసీ హాస్టల్‌లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ సీహెచ్. చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్‌లో 83 సీట్లు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బీసీ వెల్ఫేర్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌఠ(బి)లోని ప్రీమెట్రిక్ హాస్టల్‌లో 45 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 12 నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 93464 08238లను సంప్రదించాలన్నారు.

మొహుతూర్ పండుగ



సంప్రదాయ ఆట ఆడుతున్న మహిళలు

నార్నూర్: ప్రతీ ఏడాది వానాకాలం సాగు ముందు మొహుతూర్ పండుగ జరుపుకోవడం ఆదివాసీల ఆనవాయితీ. ఈసందర్భంగా పొలానికి వెళ్లి భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత విత్తనాలు విత్తే కార్యక్రమానికి శ్రీకారం చుడుతారు. సోమవారం గాదిగూడ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో మొహుతూర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామ శివారుకు చేరుకొని బుర్రో ఆట ఆడారు. మహిళలు భక్తిపాటలు పాడుతూ.. నృత్యం చేశారు.

హాస్టళ్లలో సకల వసతులు

- తాంసి, కప్పర్ల ఎస్సీ హాస్టల్‌లో ప్రారంభమైన అడ్మిషన్లు
- వంద సీట్ల భర్తీకి కసరత్తు



తాంసిలోని షెడ్యూల్ కులాల సంక్షేమ వసతిగృహం

తాంసి: షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అన్నిరకాల వసతులతో విద్యార్థుల కోసం ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వీటిలో భాగంగా తాంసి మండల కేంద్రంతో పాటు కప్పర్ల గ్రామంలో ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. తాంసితో పాటు కప్పర్ల గ్రామంలో ఉన్న ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య పూర్తిస్థాయిలో భర్తీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ హాస్టల్‌లో చేరాలని కోరుతున్నారు. తాంసి, కప్పర్ల గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న వసతిగృహ భవన సముదాయాల్లో విద్యార్థులకు సరిపడా మౌలిక సదుపాయాలు ఉన్నాయి. విశాలమైన భవన సముదాయంతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలు, స్నానపు గదులున్నాయి. వేడినీరు అందించేందుకు గీజర్లు సైతం ఏర్పాటు చేశారు. వసతిగృహంలో ఉండే విద్యార్థుల సంఖ్య ప్రతీఏటా తగ్గుతూ వస్తోంది.

100 మంది విద్యార్థులకు అడ్మిషన్లు..

తాంసి, కప్పర్ల గ్రామాల్లోని ఎస్సీ సంక్షేమ వసతిగృహంలో 100 మందికి అడ్మిషన్లు కల్పించే అవకాశం ఉంది. వరుసగా రెండేళ్లుగా సంక్షేమ వసతిగృహంలో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు జరగక హాస్టల్‌లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ప్రస్తుతం తాంసిలో 29 మంది, కప్పర్లలో 37 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అధికారులు వందశాతం విద్యార్థులను చేర్పడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇతర మండలాలకు చెందిన విద్యార్థులకు సైతం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొంటున్నారు. మొత్తం 100 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు సీట్లు కేటాయించగా ఇందులో ఎస్సీలకు 75, బీసీలకు 12, ఎస్టీలకు 6, మైనార్టీలకు 3, ఓసీలకు 2, ఇతరులకు 2 సీట్లు ఉన్నాయి. తాంసి వసతిగృహంలో 71, కప్పర్ల వసతిగృహంలో 63 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

నాణ్యమైన భోజనం..

ఉదయం 7 గంటలకు రాగిజావ, పాలు ఇస్తారు. అనంతరం గంట తర్వాత బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఉప్మా, పులిహోర, కిచిడి రసం, ఇడ్లి చట్నీ, జీర రైస్, టమాట అన్నం ఇస్తారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనం ఉంటుంది. సాయంత్రం ఐదు గంటలకు స్నాక్స్ కింద పల్లి పట్టీ, అటుకులు, బిస్కెట్స్, శనగలు, బొబ్బర్లు, స్వీట్స్‌తో పాటు ప్రతీ ఆదివారం మధ్యాహ్నం చికెన్ బగారా రైస్ ప్రత్యేకంగా అందిస్తారు. వారంలో రెండు రోజులు గుడ్డుతో పాటు అరటిపండ్లు, ఇతర పండ్లు అందించడం జరుగుతుంది. ప్రతీ విద్యార్థికి నాలుగు జతల డ్రెస్‌లు, ట్రంక్ పెట్టె, నోట్‌బుక్స్, బ్యాగ్, షూస్, కార్పెట్ అందిస్తారు. ప్రతీ నెల సబ్బులు, ఇతర అవసరాల కోసం రూ.62 సైతం అందించడం జరుగుతుందని వసతిగృహ అధికారులు చెబుతున్నారు.

వందశాతం సీట్లు భర్తీ చేస్తాం



తాంసి, కప్పర్ల వసతి గృహాల్లో 100 సీట్లను భర్తీ చేయడానికి ఉన్నతాధికారుల సూచనలు, సలహాలతో ముందుకెళ్తున్నాం. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు సీట్లను భర్తీ చేసేలా గ్రామాల్లో విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించాం. ఇప్పటికే పలువురు విద్యార్థులు హాస్టల్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారు.

– బి.సురేందర్, హాస్టల్ వార్డెన్, తాంసి

రైతులను మోసం చేస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఇంద్రవెల్లి: నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి అరుణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. సీడ్ స్టాక్, రిజిస్టర్, గ్రౌండ్ స్టాక్, బిల్ బుక్కులు, స్టాక్ బోర్డు పరిశీలించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలను కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈవో మల్లేష్, నవతేజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఫర్టిలైజర్ వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టార్‌లను పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. విత్తనాలు కొనుగోళ్లు చేసిన ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. రోజువారీగా స్టాక్‌ను బోర్డుపై రాసి ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్

డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లోకి వచ్చి అధిక దిదుబడులు పేరుతో నమ్మించే వారి మాటలు నమ్మవద్దన్నారు. బీజీ– 3 విత్తనాలపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. భూములు సాంద్రం కోల్పోయి భవిష్యత్‌లో పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. నకిలీ వ్యాపారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు సూచించారు.

వర్షాలు కురవగానే మొక్కలు నాటాలి

నేరడిగొండ: వర్షాలు కురువగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. సోమవారం మండలంలోని కొర్టికల్(బి) గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో గల నర్సరీల్లో ఎన్ని మొక్కలు ఉన్నాయో లెక్కించి గ్రామస్తులకు అందజేసి మొక్కలు నాటించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

ఎమ్మెల్యే పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మడావి ప్రభు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వైద్యం చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం ఆసుపత్రిని సందర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ఆర్థిక సాయం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని వడోని గ్రామానికి చెందిన సూర్యవంశీ శ్యాంరావు నీలబాయి దంపతులకు ఏకైక కుమార్తె సూర్యవంశీ సక్కుబాయి చర్మ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.



వివరాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

బోథ్: పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బోథ్ మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం నుంచి మండలంలోని పాఠశాలలకు పుస్తకాలు చేరాయి. పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పుస్తకాలను పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. మండల వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 4458 మంది విద్యార్థులకు పుస్తకాలను అందించనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో ముందస్తుగానే పుస్తకాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో భూమారెడ్డి

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

ఎదులాపురం: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, కార్యదర్శి ఇస్తారి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీల షెడ్యూల్ ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు అనేక సంవత్సరాలుగా బదిలీలు, పదోన్నతులు లేక ఆందోళన చెందుతున్నారన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఉపాధ్యాయుల్లో నూతన ఉత్తేజాన్ని పెంపొందించి నాణ్యమైన విద్యను అందించడంలో తోడ్పడుతుందన్నారు.

వేతనాలు పెంచాలని పీవోకు వినతి

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు, దినసరి, పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో దుర్భ జీవితాలు గడుపుతున్నామని, వేతనాల పెంపుతో పాటు నెలనెలా వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఇందులో నాయకులు శ్రీనివాస్, కమల, రంభ, సోనేరావు, విఠల్, బాపురావు, భరత్, చందు, ఝునీ, సమ్మయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు

'తప్పుడు నివేదిక ఇవ్వడం సరికాదు'

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల రోజున తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో జరిగిన ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఘటనపై జెడ్పీ సీఈవో విచారణ జరిపి అందించిన నివేదిక తప్పుగా ఉందని ధర్మసమాజ్ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఈవో క్షేత్రస్థాయికి వెళ్లకుండానే కలెక్టర్‌కు నివేదికను అందించారన్నారు. పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ నాయకులతో భోజనాలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలపై ప్రజాస్వామ్యాన్ని అపహస్యం పాలు చేసేలా వ్యవహరించిన ఇలాంటి అధికారులను ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకురాలు మెస్రం గంగాదేవి, గొంటిముక్కుల ఒమన్న, దుమ్మ తిరుపతి, తొంటికూరి సంతోశ్, బండారి సంతోశ్, అగ్గిమల్ల గంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేష్

భూకబ్జాదారులను కఠినంగా శిక్షించాలి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం వార్డు నెంబర్ 38 కైలాస్‌నగర్‌లోని కాలనీ డెవలప్‌మెంట్ సొసైటీకి సంబంధించిన 8 ప్లాట్లలోని 2 ప్లాట్లను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ల్యాండ్ మాఫియాపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆ కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్‌ల ఆధ్వర్యంలో సభ్యులు కబ్జాను అడ్డుకుని సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ.. ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లు కబ్జా చేసిన ప్లాట్స్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ముత్యాల చిట్టిబాబు, రాంకిషన్, రాంకుమార్, రాంరెడ్డి, కొండల్ రావ్, బాబురావు, రాకేశ్, త్రినాథ్ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నార్నూర్: పాలన సౌలభ్యం కోసం గత ఏడేళ్ల క్రితం నూతనంగా ఏర్పాటు చేసిన గాదిగూడ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడంతో ఆదివాసీ గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో మాట్లాడారు. మండలంలో మొత్తం 25 మండలాలు ఉన్నాయని అన్నారు. ఆధార్‌కార్డు లేకపోతే మనిషికి గుర్తింపే లేదని అన్నారు. ఆధార్‌కార్డు సెంటర్ కోసం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు దరఖాస్తులు పెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

బొజ్జన్న బువ్వ పునఃప్రారంభం



అన్నం వడ్డిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రతీ సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే గిరిజన దర్బార్‌కు వచ్చే గిరిజనుల కోసం బొజ్జన్న బువ్వ కార్యక్రమం నిర్వహిస్తుండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్ని రోజులుగా నిలిపివేశారు. కాగా.. సోమవారం నుంచి పునఃప్రారంభించడం జరిగిందని కొత్తగూడ మాజీ సర్పంచ్ ఆత్రం రాహుల్ తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముబీన్, ఉమేర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'భగీరథ' సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ సర్వే సోమవారం ప్రారంభమైంది. 33 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, ఐకేపీ సీసీలు ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహించారు. పైప్‌లైన్ ద్వారా నీరు అందుతుందా? లేదా? అన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఆధార్ కార్డు వివరాలతో పాటు సర్వే వివరాలను సర్వే యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. బోథ్‌లో సర్వేను ఎంపీడీవో రమేశ్ పరిశీలించారు.

పనులు వేగవంతం చేయాలి

ఇచ్చోడ: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న మరుగుదొడ్లు మరమ్మతుల పనులు వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని కోకస్‌మన్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతుల పనులు పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమైనందున విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు బుచ్చిబాబు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం: ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఎండీఎం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్నాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

బేల: పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా పశువులను తరలిస్తున్నారని సమాచారం మేరకు ఆదివారం రాత్రి మండలంలోని బాది గ్రామ శివారులో తనిఖీలు చేయగా.. 16ఎద్దులు పట్టుబడ్డాయన్నారు. పశువుల అక్రమ రవాణా చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: ఏడీఎం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎండీఎం యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. కోడి గుడ్లకు బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నృత్య సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పన్నాల లాస్య బృందం ఆనంద తాండవం, సంజన, అక్షర, మామిడి అక్షయ, అక్షిత, శ్రీనిధి, క్షీర, మోక్ష, జాహ్నవి, తేజస్విని బృంద సభ్యులు దేవి స్తుతిపై, అలేఖ్య, జతీ స్వరంపై ఇతీక్ష మహిషాసుర మర్దిని సంగీతంపై నర్తించి ఆహుతులను అలరించారు. వీరి ప్రతిభతో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు.

కేసు నమోదు

ఎదులాపురం: పట్టణ టుటౌన్ పరిధిలో సోమవారం గొడవ కేసు నమోదైంది. సీఐ అశోక్ కథనం ప్రకారం.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన మక్కల లక్ష్మణ్, దండ్ల నగేశ్‌లు ఈనెల 8న పందులు పట్టేందుకు సంజయ్‌నగర్ కాలనీకి వెళ్లారు. ఇంతలో నగేశ్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేయగా.. భూమక్క, ఎల్లయ్య, బంధువు నర్సమ్మ అక్కడి చేరుకున్నారు. తమ పరిధిలోని ప్రాంతంలో పందులు ఎందుకు పడుతున్నావ్ అని లక్ష్మణ్‌ను ప్రశ్నించారు. ఈ క్రమంలో లక్ష్మణ్‌పై ఎల్లయ్య కర్రతో దాడి చేయగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

బోథ్: మండల కేంద్రంలోని కొత్త కాలనీకి చెందిన 42 ఏళ్ల మాల్వే చంద్రకళ అనే మహిళ ఆదివారం నుంచి కనిపించడం లేదని బోథ్ ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం చంద్రకళ భర్త మాల్వే సంజీవ్ కూలీ పని నిమిత్తం ఉదయం బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాగానే చంద్రకళ కనిపించలేదు. తమ బంధువులకు అడిన సమాచారం లేకపోవడంతో సోమవారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని అంతర్గాం, అర్లి(టి), వడూర్, భీంపూర్ గ్రామాల్లో నిర్వహించిన బడిబాటలో ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, సురేందర్, కిష్టు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో శ్రీకాంత్